పేదింటి విద్యా కుసుమాలు

- కష్టాలు చూసి.. కన్నవారి కలలు నిజం చేశారు
- పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు


తేజశ్రీ (587)


శ్రావణి (580)


బి.వైష్ణవి (583)


సి: దీక్షిత (582)

మదనపల్లె సిటీ: అమ్మాయిలు చదువులో ముందంజలో నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించి అందరి చేత మన్ననలు పొందారు. పది పరీక్ష ఫలితాల్లో మదనపల్లె పట్టణంలోని మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సామాన్య,పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తమ తల్లిదండ్రుల కష్టాలను కళ్లారా చూసి చదివే ధ్యేయంగా ముందడుగు వేసి కలను సాకారం చేసుకున్నారు.

ఉత్తమ మార్కులతో..

మదనపల్లె పట్టణం మారుతీనగర్‌కు చెందిన రామకృష్ణ, లక్ష్మీదేవిలు చేనేత కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె తేజశ్రీ స్థానిక వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల(ఆర్.ఆర్ లేవుట్)లో 6 నుంచి 10 వరకు చదివింది. పది ఫలితాల్లో 587 మార్కులు సాధించి పాఠశాలలో టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రుల పడే కష్టాన్ని చూసి ఉన్నత విద్యాభ్యాసం చేసి మంచి హోదాలో ఉండాలన్నదే తన ప్రధాన ఉద్దేశమని తేజశ్రీ తెలిపారు.

ఇష్టంగా కష్టపడి..

మదనపల్లె పట్టణం ఎస్టేట్‌కు చెందిన ఈశ్వరయ్య స్థానిక ఓ హోటల్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరి కుమార్తె శ్రావణి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. పది పరీక్షల్లో 580 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసిన విద్యార్థిని ఎలాగైనా మంచి మార్కులు సాధించాలని ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో 580 మార్కులు పొంది వారి కలను నిజం చేసింది.

చిన్నప్పటి నుంచి ..

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన బి.రెడ్డిశేఖర్, బి.భారతి చేనేత కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె బి.వైష్ణవి స్థానిక వివేకానంద మునిసపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివింది. చిన్నప్పటి నుంచి చదువుల్లో రాణిస్తోంది. పది పరీక్ష ఫలితాల్లో 583 మార్కులు సాధించింది. తల్లిదండ్రుల కృషిని చూసిన తాను ఉన్నత స్థానంలో ఉండాలన్నదే తన ప్రధాన లక్ష్యమని వైష్ణవి అంటున్నారు.

చదువే ధ్యేయంగా..

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన పి.నాగరాజు, పి.ప్రమీల చేనేత కార్మికులుగా పని చేస్తూ జీవిస్తున్నారు. వీరి కుమార్తె పి.దీక్షిత స్థానిక వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదివింది. ఇటీవల పది పరీక్ష ఫలితాల్లో 582 మార్కులు సాధించింది. ఎప్పటికైనా ఉన్నతమైన ఉద్యోగం సాధించి కన్నవారి కలను నిలపాలన్నదే తన లక్ష్యమని దీక్షిత పేర్కొంది.

సమస్యలు పరిష్కరించాలని వినతి

– ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ


ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న బాధితులు

మదనపల్లె : రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. సమస్యలు పరిష్కారం కావడం లేదు. కనీసం మీరైనా పరిష్కరించండయ్యా అంటూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ప్రజలు తమ గోడువెళ్లబోసుకున్నారు.

– రామసముద్రం మండలం కమ్మవారిపల్లె గ్రామ పంచాయతీ యర్రబోయనపల్లెకు చెందిన కోనంగి వెంకటమ్మ...తమకు పక్కా ఇల్లు మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంటే...తన భర్త కోనంగి చిన్నవెంకటప్ప పేరుమీద 10 ఎకరాల భూమి ఉందని ఆన్‌లైన్‌లో చూపిస్తుండటంతో అధికారులు నిరాకరించినట్లు తెలిపింది. అయితే తన భర్త పేరుమీద కాప్పల్లె గ్రామంపైకి 4.39 ఎకరాల భూమి మాత్రమే ఉందని, తమ గ్రామంలో తమకు ఎలాంటి ఆస్తులు లేవని పేర్కొంది. భర్త పేరు మీద నమోదైన భూమిని ఆన్‌లైన్‌లో తొలగించి, తమకు పక్కా ఇల్లు మంజూరుచేయాల్సిందిగా వినతిచేసింది.

– మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీలో పశువులకు తాగునీటి కోసం ఏర్పాటుచేసుకున్న కొత్తచెరువును కొంతమంది భూకబ్జాదారులు ఆక్రమించుకుని, చెరువు కట్టను ధ్వంసం చేశారని గ్రామస్తులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై ఆక్రమణదారుడైన కృష్ణమూర్తిని నిలదీస్తే చెరువు కట్ట నిర్మించి ఇస్తానని చెప్పి ప్రస్తుతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఎలాగైనా చెరువుకు కట్ట ఏర్పాటుచేసి, పాడిపశువులకు నీటిసమస్య లేకుండా చూడాలన్నారు.

– అంగళ్లు గ్రామం చిన్నహరిజనవాడకు చెందిన నీరుగట్టినరసింహమ్మ...తమ గ్రామంలో తన తల్లి పేరుమీద అంగళ్లు గ్రామంలో సర్వేనెం.133/1ఈ, 133/3ఈలలో ఉన్నటువంటి 85 సెంట్ల భూమిని ఇతరులు కబ్జా చేశారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేసింది. దీనికి సంబంధించి ఒకటిన్నర సంవత్సరంగా తహసీల్దార్‌కు అనేక అర్జీలు పెట్టుకుంటూ వస్తే, సర్వేయర్‌ను సర్వే కోసం పంపితే, కబ్జాదారులైన పగడాల రెడ్డెప్ప, రాజులు అడ్డుకుంటున్నారని తనకు న్యాయం చేయాల్సిందిగా వేడుకుంది.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయమూరి ఉమర్ ఫారూఖ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగమల్‌రెడ్డి ,కార్యదర్శి గఫూర్‌ల ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టుకు వచ్చే కక్షిదారులకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిపై బార్ అసోసియేషన్ సభ్యులను న్యాయమూర్తి అభినందించారు.

కిషోర వికాసంపై అవగాహన

తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టనున్న కిషోర వికాసంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సీడీపీఓ నాగవేణి కిషోర వికాసం కార్యక్రమం అమలు చేసేందుకు ఏర్పాట్లు, బాల్యవివాహాలు, లింగవివక్షత తదితర అంశాలపై వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని కిషోర బాలికలకు కిషోర వికాసంపై చైతన్యం చేయాలని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, కార్యాలయ ఏఓ థామస్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు మధుసూధన్ తన భార్య మీనా పుట్టిన రోజును విద్యారణ్య ఆశ్రమంలోని చిన్నారులు, వృద్ధుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 120 మంది వృద్ధులు, చిన్నారులకు అన్నదానం చేసి స్వీట్లు పంచి పెట్టినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సెక్రటరి లక్ష్మణ్‌లు సోమవారం పేర్కొన్నారు.

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

తంబళ్లపల్లె: ప్రయాణికుల ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు... గుర్రంకొండ మండలం చెర్లోపల్లికి చెంది పది మంది ఆటోలో మల్లయ్యకొండకు వచ్చారు. స్వామిని దర్శించుకుని కొండపై నుంచి తిరుగుప్రయాణంలో కింద నుండి 5వ మలుపు వద్ద ప్రమాదశాత్తు ఆటో బోల్తా పడింది.శ్రీనివాసులు (40),మరో బాలుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటనను గుర్తించిన కర్నాటక భక్తులు బాధితులను కారులో సీహెచ్‌సీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ విక్రాంత్‌రెడ్డి వైద్య చికిత్సలు చేశారు. మల్లయ్యకోండ ఘాట్ రోడ్డులో ఆటోలను నిషేధించాలని ఇప్పటికే రెండు సార్లు ఆటో ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు కోరుతున్నారు.

పశుగ్రాసం వితరణ


మల్లయ్యకొండకు గ్రాసం తరలిస్తున్న దాత

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై గోశాలలోని పశువులకు ఓ దాత పశుగ్రాసాన్ని సోమవారం వితరణగా ఇచ్చారు. గోపిదిన్నె పంచాయతీ రాగిమానుదిన్నెపల్లెకు చెందిన డి.చంద్ర సుమారు పదివేల రూపాయల విలువైన ట్రాక్టర్ గడ్డిని మల్లయ్యకొండకు చేర్చారు. ఆయన దాతృత్వాన్ని భక్తులు అభినందించారు. మల్లయ్యకొండ అడవి అగ్నిప్రమాదం గురికావడంతో పశువులకు మేత కరువైంది. దాతలు ముందుకువచ్చి పశువులకు పశుగ్రాసాన్ని అందజేయాలని భక్తులు కోరుతున్నారు.

ఏఐటీయూసీ నాయకులపై కేసు

మదనపల్లె : జెండా దిమ్మె ఏర్పాటు విషయంలో కార్మిక యూనియన్ నాయకులకు మధ్య జరిగిన వివాదంలో దాడికి సంబంధించి సీఐటీయూ నాయకుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఏఐటీయూసీ నాయకులు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మేడే సందర్భంగా జెండా ఎగురవేసేందుకు దిమ్మె నిర్మాణానికి ఆదివారం సీఐటీయూ నాయకులు ప్రయత్నించారు. దీన్ని ఏఐటీయూసీ నాయకులు అడ్డుకుని, జెండా దిమ్మె ఏర్పాటుచేయవద్దని చెప్పడంతో రెండు యూనియన్ నాయకుల మధ్య వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో సీఐటీయూ నాయకుడు రామకృష్ణ గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ ఫిర్యాదుమేరకు ఏఐటీయూసీ నాయకులు ముబారక్, పృథ్వీరాజ్, ఓబులేషు, సాంబశివ, సురేష్‌కుమార్, అశోక్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమ వసూళ్లపై విచారణ జరిపించండి

మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి


అక్రమవసూళ్లపై విచారణ జరపాలని చైర్‌పర్సన్ మనూజారెడ్డిని కోరుతున్న సీఐటీయూ నాయకులు

మదనపల్లె : మున్సిపల్ కార్మికుల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) సమస్యలు పరిష్కారం చేస్తామనే సాకుతో యూనియన్ల పేరుతో మదనపల్లె మున్సిపాలిటీలో చేసిన అక్రమ వసూళ్లపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌లకు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లోకి మార్పుచేసేటప్పుడు ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో అనేక సమస్యలు వచ్చాయన్నారు. దీంతో పీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోలేకపోవడం, నగదు జమ కాకపోవడం తదితర సమస్యలతో కార్మికులు సతమయ్యారన్నారు. ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో యూనియన్ నాయకులమని చెప్పుకుని పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తామని కార్మికుల నుంచి వేలకు వేలు నగదు వసూళ్లు చేశారన్నారు. అయితే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో..తమ డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని అడిగితే ఎదురుదాడులు చేయడంతో పాటు ఉద్యోగాలు ఊడబెరికిస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి అక్రమ వసూళ్లకు పాల్పడిన యూనియన్ నాయకులపై చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే 1వ తేదీన మేడే వేడుకలకు మున్సిపల్ కార్మికులు పని చేసే ప్రతి డివిజన్‌లోనూ, మస్టర్ల పాయింట్ల వద్ద సీఐటీయూ జెండా ఎగురవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, కార్యదర్శి పి.రాజేశ్వరి, డి.ప్రభాకరరెడ్డి, అంగన్‌వాడీ నాయకురాలు మధురవాణి, నాగరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మేడే సంబరాలు జరుపుకోవాలి


పంచాయతీ కార్మికులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా, ఈఓ గురుమోహన్

పీలేరు : మే 1న కార్మికుల దినోత్సవం (మేడే) ప్రశాంతంగా జరుపుకోవాలని సర్పంచ్ హబీబ్‌బాషా, ఈఓ గురుమోహన్ అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో కార్మికులకు మేడే ఉత్సవాలకుగానూ సర్పంచ్ రూ. 10 వేలు, ఈఓ రూ. 5 వేలు సొంత నిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ప్రజారోగ్యం కోసం నిరంతరం సేవ చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, వార్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, పరమేష్, షాజహాన్, సచిన్ పాల్గొన్నారు.

డార్టింగ్ గన్ వినియోగంపై శిక్షణ


డార్టింగ్ గన్ వినియోగంపై ఫారెస్ట్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న పశువైద్యాధికారి షిరీన్ లారెన్స్

మదనపల్లె : వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అటవీ సిబ్బందికి ఏర్‌బ్లో, ఏర్‌గన్ వినియోగంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె మండలంలోని పొన్నూటిపాలెం సమీపంలోని అటవీప్రాంతంలో చిరుతపులి ఉచ్చులో చిక్కుకుని, సకాలంలో సహాయకచర్యలు తీసుకోకపోవడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనలో ఫారెస్ట్ అధికారులు డార్టింగ్ గన్ వినియోగించడంలో విఫలమైన అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు...భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు తలెత్తితే, డార్టింగ్ గన్, బ్లోపైప్ వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఫారెస్ట్ రేంజర్ జయప్రసాదరావు ఆధ్వర్యంలో పశువైద్యాధికారి షిరీన్ లారెన్స్...ప్రమాదకర పరిస్థితుల్లో వన్యప్రాణులను సురక్షితంగా రక్షించే పద్ధతులు, శాంతింపజేసే సాంకేతికతలను నేర్పారు. ఈ సందర్భంగా రేంజర్ జయప్రసాదరావు మాట్లాడుతూ...మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ పరిధిలో చిరుతపులులు, వన్యప్రాణులు మానవ సమూహాల్లోకి రావడం, ఇబ్బందులు కలగడం జరుగుతుండటంతో సిబ్బంది త్వరితమైన, ప్రభావంతమైన చర్యలు తీసుకునేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనట్లు తెలిపారు. కార్యక్రమంలో మదన్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోండి


సర్పంచ్‌కు వినతిపత్రం పట్టణవాసులు

పీలేరురూరల్ : పట్టణంలోని కోటపల్లెలో ఉన్న శ్రీ కాశీవిశాలాక్షి ఉద్యానవనం (పబ్లిక్ పార్క్) అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు సోమవారం సర్పంచ్ హబీబ్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, బల్లలు విరిగిపోయాయన్నారు. పార్కులోనికి పాములు వస్తున్నాయని తెలిపారు. గతంలో ఉన్న విధంగా పార్కులు ఉదయం సాయంత్రం వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. మహిళలు, వృద్ధులు, పిల్లలుకు వాకింగ్‌కు, ఆటవిడుపునకు అనువుగా ఉండేదని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు కె. సదాశివరెడ్డి, ఎస్. చాన్‌బాషా, హరినాథరెడ్డి, సహదేవనాయక్, శివశంకర్, వెంకటేష్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

కురబలకోట: మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తేరు లాగి భక్తులు భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. గోవింద నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఉదయం, సాయంత్రం తేరును నాలుగు వీధులలో తిప్పారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కల్గించింది. మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. మదనపల్లె జ్ఞానోదయ హైస్కూల్ కరస్పాండెంట్, గ్రామ మాజీ సర్పంచ్ కామకోటి ప్రసాదరావు పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవ భక్తులకు అన్న సంతర్పణ గావించారు.


రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సమస్యలు పరిష్కరించాలని రిలేదీక్షలు


రిలేదీక్షలు చేపట్టిన ఎన్ఎంయూ నాయకులు


పీలేరు ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ రిలేదీక్షలు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఎన్ఎంయూ కడప జోనల్ అధ్యక్షులు పి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల భద్రతా సర్కులర్ అన్ని డిపోల్లో అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్, రిమ్యూవల్స్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని, ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ ద్వారానే నడపాలన్నారు. డబుల్ డ్యూటీ అమౌంటు పెంచాలని, ఆన్‌కాల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. దీక్షల్లో రీజనల్ చైర్మన్ సుందరరాజు, శ్రీరాములు, వి.వి.రమణ,మునికృష్ణ, రెడ్డిభాష, గంగాధర్, బిఎల్ ప్రసాద్, రెడ్డప్ప, వెంకటస్వామి, అరుణకుమారి, షరీఫ్, ఎస్.కె.వల్లి, మన్యం, ఫరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం స్థానిక డిపో కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ నాయకులు మాట్లాడుతూ 2019 సర్క్యులర్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. గ్యారేజి ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం లేదా సంస్థే కొనుగోలు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ విధానానికి బదులుగా పాత వైద్యవిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ ఎ.ఆర్. చంద్ర, కె. రఘు, వి.ఎస్ జయంతి, ఎం.ఎ. రాధ, వి.పి. కుమార్, రవి, బి. ఆనంద్, బి.ఎస్. శంకర్, డి. సుభాషిణి, పి.ఎస్. రాములు, ఆర్. ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

బాస్కెట్ బాల్ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): క్రీడలలో రాణించడం ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి అన్నారు. స్థానిక పీవీసీ ఉన్నత పాఠశాలలో ఉచిత బాస్కెట్‌బాల్ క్రీడా కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవిచంద్ర ఆధ్వర్యంలో క్యాంప్ జరుగుతుందన్నారు. శిక్షణకు హాజరయ్యే క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ఆసక్తి కలిగిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల శ్రీ కొత్తపురమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పూజారివాండ్లపల్లె సమీపంలో కొలువైన శ్రీ కొత్తపురమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మించి అందులో అమ్మవారి విగ్రహప్రతిష్ట మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులచే భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.


హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు బిల్లులు

కలికిరి: ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయడానికి వీలుగా ప్రభుత్వం అదనపు బిల్లుల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ భానుమూర్తిరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గుణావర్థనం దశ నుంచి మోల్డింగ్ దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా నేరుగా ఖాతాకు జమచేయడం జరుగుతుందన్నారు. వివిధ దశలలో నిర్మాణాలను ఆపేసిన లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జూన్ లోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేయడానికి పంచాయతీకి ఒక్కో అధికారిని నియమించి పర్యవేక్షిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ధర్నా, రాస్తారోకోలకు అనుమతి తప్పనిసరి

నిమ్మనపల్లె : కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రదాడి సంఘటనల నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ ఆదేశాల మేరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండల ప్రజలు, పోలీసుల అనుమతులు లేకుండా ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు చేయరాదన్నారు. అటువంటి వాటికి ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఒకేచోట ఉండరాదన్నారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పోలీసుల ఆదేశాలను పాటించకుండా ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వేసవి కాలంలో పాఠశాలలకు సెలవులు ఉన్నందున మండలంలోని చెరువులు, బహుదా ప్రాజెక్టులో లోతైన నీటి గుంతలు ఉన్నాయన్నారు. పిల్లలు ఈత కోసం వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. లేకుంటే అనుకోని ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు.

ఉచిత సమ్మర్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రాజగోపాల్

మదనపల్లె సిటీ: ఉచిత సమ్మర్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రాజగోపాల్ అన్నారు. సోమవారం స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ శిక్షణ జూన్ 6 వరకు జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.స్పోకెన్ ఇంగ్లీషు, మానవతా విలువలు, యోగ, చిత్రలేఖనం తదితర అంశాలపై అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి వేసవి శిక్షణ తరగతులకు పంపాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వసంతకుమారి, గొల్లపూడి తిరుపతిరావు, రెడ్డప్ప, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేయమంటే అరెస్టులు చేస్తారా ?

రాయచోటి అర్బన్ : బీసీ కులాల అభ్యున్నతికి తోడ్పడే కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్న నేతలను ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన పలు బీసీ సంఘాల నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు జనాభా లెక్కలతో పాటు వెంటనే కులగణనను చేపట్టాలన్న డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ర్యాలీ చేస్తున్న వారిని అరెస్టుచేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు దువ్వూరి నరసింహాచారి, వెంకటరమణ, శ్రీనివాసులు, హబీబుల్లా, తులసీరామ్, రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఇట్నేనివారిపల్లెలో తాగునీటి కష్టాలు


నీరు రాక ఆగిపోయిన బోరు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని ఇట్నేనివారిపల్లెలో నెల రోజులుగా తాగునీటి కష్టాలు తప్పడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇక్కడ సుమారు 60 కుటుంబాలవారు రోజువారీ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరులో భూగర్భజలాలు అడుగంటి తాగునీరు కేవలం 15 నిమిషాలపాటు వస్తాయని నీరు ఎక్కడికి చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నేరు ప్రాజెక్టు నుంచి మంచినీటి పైప్‌లైన్‌ను గ్రామానికి అనుసంధానం చేసిన ప్రెజర్ లేకపోవడంతో ఫలితం లేకపోయింది. వీరంతా రోజు కూలీకి వెళ్లి మధ్యాహ్నం ఇంటికిరాగానే తాగునీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరులేక పశువులు కూడా అలమటిస్తున్నాయన్నారు. అధికారులు స్పందించి తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.